# <u>పత్రికా ప్రకటన</u>

తేది.10.07.2017.

## <u>పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నిరోధంపై విద్యాసంస్థల్లో అవగాహనా కార్యక్రమాలు</u>

సమాజంలో కళాశాలలో, విద్యాసంస్థలు, ప్రభుత్వ మరియు ప్రైవేటు హాస్టళ్ళలో కొత్తగా చేరిన విద్యార్థులను ఆహ్వానించే వంకతో లేక పరిచయం చేసుకునే నెపంతో తోటి సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో చేస్తున్న వికృత చర్యల కారణంగా జూనియర్ విద్యార్థులు మానసిక ఆందోళనకు గురవుతున్నారు. ర్యాగింగ్ కారణంగా ఆసహనానికి, అవమానాలకు, అసౌకర్యాలకు గురైన విద్యార్థులు చదువు మానేయడం, బయటకు చెప్పుకోవడానికి వీలుకాని కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్న ఘటనలు దేశంలో అక్కడక్కడా జరుగుతున్నాయి. అలాగే కష్టపడి చదివి ఉన్నతమైన స్థానాలను సంపాదించాల్సిన కొంత మంది యువత ర్యాగింగ్‌కు పాల్పడి జైలుపాలై వారి భవిష్యత్తు అంధకారం చేసుకుని తల్లి దండ్రులను బాధలకు గురి చేస్తున్నారు.

ఒక విద్యార్థిని భయపెట్టడం, నిర్భందించడం, అసహనానికి గురిచేయడం, బెదిరించడం వంటి చర్యలను "ర్యాగింగ్"గా పరిగణించడం జరుగుతుంది. ఎంతో కష్టపడి ఉన్నతమైన ఆశయాలతో చదువుకునేందుకు వచ్చే విద్యార్థులను, వారి తల్లి దండ్రులను బాధలకు గురిచేసే ర్యాగింగ్ అనే అనాగరిక చర్య చట్ట విరుద్ధమైనది.

ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమీషనర్ శ్రీ డి.గౌతం సవాంగ్ ఐపిఎస్ గారు ర్యాగింగ్ వికృత చర్యల వలన కలిగే దుష్పరిణామాల గురించి అందరికీ తెలియజేసి సామాజిక స్పృహ కలిగించేందుకు అలాగే కమీషనరేట్ పరిధిలో ఉన్న విద్యాసంస్థల్లో ఎక్కడా ర్యాగింగ్ దుశ్చర్యలకు ఆస్కారం లేకుండా కళాశాల ప్రాంగణాల్లో ర్యాగింగ్‌పై పోస్టర్లు ప్రదర్శించడం మరియు కరపత్రాల పంపిణీ చేయడం ద్వారా, విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిరోధంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం తదితర చర్యలు చేపట్టి శాఖాపరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరిగింది.

ఈ నేపథ్యంలో విజయవాడ నగర పోలీస్ కమీషనర్ గారి ఆదేశాలపై ర్యాగింగ్ నిరోధంపై ది.10.07.2017న కమీషనరేట్ పరిధిలో ఉన్న కళాశాలల్లో పోలీస్ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కళాశాలలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ హాస్టళ్ళలో ర్యాగింగ్ అనాగరిక చర్యలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, చేపట్టవలసిన ముందస్తు జాగ్రత్తలు, ర్యాగింగ్ నిరోధక చట్టాలు, ర్యాగింగ్‌కు పాల్పడితే విధించే శిక్షలు, ర్యాగింపై న్యాయస్థానాలు ఇచ్చిన మార్గదర్శకాలు, కళాశాలలు మరియు విద్యాసంస్థలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలు, ర్యాగింగ్ నిరోధానికి ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు మరియు అధ్యాపకుల పాత్రపై అవగాహన కలిగించడం జరిగింది. అలాగే ర్యాగింగ్‌కు పాల్పడి శిక్షలు పడిన వారు భవిష్యత్తులో చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని, సమాజాన్ని మార్చే శక్తి ఉన్న యువత ఉత్తమ జీవన ప్రమాణాలతో, ఉన్నత విలువలతో చదువుపై దృష్టి సారించి తల్లి దండ్రులు గర్వపడే విధంగా వృద్ధిలోకి రావాలని విద్యార్థులకు తెలియజేశారు.

ఎవరైనా ర్యాగింగ్‌కు గురైతే ధైర్యంగా ముందుకు వచ్చి సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు గాని పోలీస్ కంట్రోల్ రూం ఫోన్ నంబర్ 100కు గానీ **4th Lion** మొబైల్ యాప్ ద్వారా గాని సమాచారం అందిస్తే ర్యాగింగ్‌కు పాల్పడిన వారిని ఉపేక్షించకుండా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది.

**భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో నలందా డిగ్రీ కళాశాల, ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో నాగార్జున జూనియర్ కళాశాల, టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కె.బి.ఎన్. కళాశాల, కంకిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో చైతన్య కళాశాల, నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలో శ్రీ విద్యా అకాడమీ, సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని త్రివేణి కళాశాల మరియు ఉయ్యూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో విక్రమ్ ఐ.టి.ఐ. కళాశాలలో** యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సమావేశాలు నిర్వహించగా సంబంధిత ఏసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, మహిళా మిత్ర కమిటీ సభ్యులు, ఆయా కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

-- xx --